# పరిమాణం

-డా॥ పెళ్ళకూరు జయప్రద సోమిరెడ్డి

ఆరోజు మార్చి ఎనిమిది. మా స్నేహితురాలి ఇంట్లో మహిళా దినం వేడుకలు ఘనంగా సాగుతున్నాయి. ఆ ఇంటి ఇల్లాలు స్వాతి డిన్నర్ సమకూర్చడంతో సత మతమైపోతోంది. ఆమె తరఫున ఆహూతుల అవసరాల్ని తెలుసుకునే నిమిత్తం ఆ లివింగ్ హాల్‌లో బొంగరంలా తిరుగుతున్నాను నేను.

గ్రూప్స్ గ్రూప్స్‌గా తమకు ఇష్టమైన వాళ్ళతో అందరూ కబుర్లు చెప్పుకుంటున్నారు.

"గట్టిదానివే మీ ఆయన్ని ఇంకా నీ వెనకే తిప్పుకుంటున్నావే?"

"ఆఁ... మొదటి నుండీ భర్తల్ని మన చెప్పుచేతుల్లో పెట్టుకోవాలి. మొగుడు కదా అని మురిపాలు పడ్డాం అనుకో అంతే మన లైఫ్ అయిపోయినట్టే..." 35 ఏళ్ళ ఆమె ముఖంలో విజయగర్వం.

నేను ఉలిక్కిపడ్డాను.

నేనెందుకు ఉలిక్కిపడాలి..?

నేనూ ఆడదాన్నే...

ఆడదాని స్వేచ్ఛ కోసం అల్లాడుతున్నదాన్నే..

కానీ ఎందుకో ఆమె మాటలు నాకు నచ్చలేదు.

నచ్చకపోవడం చిత్రమే.

ఎందుకంటే

నేనూ పోరాడుతున్నాను.

మా హక్కుల కోసం పోరాడుతున్నాను.

కానీ

మనం పోరాడుతున్నది దేనికోసం?

సమానత్వం కోసమా?

ఆధిపత్యం కోసమా?

మన మనసులు నలిగిపోకుండా చూసుకోవడం కోసమా?

మన మగాడి మనసును నలపడం కోసమా?

మనకేం కావాలో మనమేం చేయాలో మనం మర్చిపోతున్నామా?

మన మేధస్సును చాపలా చుట్టి అవతల పెట్టేశామా?

నాలో చిక్కటి దిగులు.

"వసుధా! కబుర్లు చెప్పడం కాదు చేసి చూపించాలి. అందుకే నా పోరాటం... పోరాటంలో భాగమే ఈ బాసిజం"

నాకు నవ్వొచ్చింది.

– ఇది పోరాటమా?

దీన్ని పోరాటం అంటారా?

కాదు

– మేమంతా పోరాడుతున్నాం.

అందరి సుఖ సంతోషాల కోసం పోరాడుతున్నాం.

పిల్లల కోసం.. వాళ్ళ శాంతియుత భవిష్యత్తు కోసం పోరాడుతున్నాం.. ఆ పోరాడుతున్న వాళ్ళల్లో నేను ఒకదాన్ని.

– మహిళా సంవత్సరం మీద ఒట్టువేసి నిజాయితీగా చెప్తున్నాను, నేను ఇంకా పోరాడుతాను.

– మా నెత్తి మీద సవారీ చేస్తున్న భర్తల అకృత్యాల్ని నిరసిస్తూ పోరాడుతాను.

– గాజు పాత్ర లాటి ఆడదాని మనసును ముక్కలు చేసి తామూ నష్టపోతున్న ఈ పురుషాహంకారానికి నా నిరసనన వ్యక్తంచేస్తూ పోరాడుతాను.

– స్త్రీని చిన్నచూపు చూస్తున్న ఈ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడుతాను.

– స్త్రీని ఆటవస్తువుగా చూస్తున్న ఈ సమాజాన్ని బహిష్కరిస్తూ పోరాడుతాను.

– భర్తతో సమాన స్వేచ్ఛ కోసం, నా తోటి స్త్రీలతో సమంగా నేను మౌనపోరాటాలు, బహిరంగ యుద్ధాలు చేస్తాను.

– మేము పోగొట్టుకున్న ఎగిరే రెక్కలను తిరిగి సంపాదించడం కోసం పట్టుదలతో పోరాడుతాను.

– ఈ మహిళా సంవత్సరం సాక్షిగా నన్ను నమ్మండి. నేనూ పోరాటంలో ఒక శక్తిని.

– కానీ... పోరాటంలో ఓ సత్యం దాగుంది.. దాన్ని గుర్తించాలి.

– గుప్పెట్లో పెట్టుకుని సాధించలేనిది – గుండెల్లో పెట్టుకుని సాధించొచ్చు.

– గెలుపు అనేది మెట్టు ఎక్కడానికి వాడుకోవాలి కానీ మనుషుల్ని ఆటబొమ్మలుగా వాడుకోవడానికి కాదనే స్వల్ప జ్ఞానాన్ని మనం పారేసుకోకూడదు.

– శిలలాటి మనసుల్ని కరిగించుకోవడమే గెలుపు.

– పువ్వులాటి స్త్రీ మనసుని శిలలా మార్చుకోవడం ఓటమి

– పరమపద సోపానంలో మనం పాము నోటి నుండి దుమికి నిచ్చెన ఎక్కాలి. అంతే కానీ..

– మన మగాణ్ణి పాము నోట్లోకి నెట్టడం మన ధ్యేయం కాకూడదు. ఈ సత్యం మనం తెలుసుకోవాలి.

లేకపోతే మన పురుషుడితో పాటు మనమూ నష్టపోతాం.

– అప్పుడే నష్టపోతే ఎలా?

ఇంకా మనం సాధించాల్సింది ఎంతో వుంది.

– అప్పుడే పారిపోతే ఎలా?

ఇంకా చాలా సమస్యలు మనముందు చేతులు కట్టుకుని నిల్చుని వున్నాయి.

– మనకు స్వేచ్ఛ కావాలని ఉద్యోగాలకెళ్తున్నాం. అక్కడ వుందా మనకు స్వేచ్ఛ?

అక్కడ వుందా మనకు రక్షణ?

– పోనీ.. ఇంటికి తిరిగి వచ్చిన మహిళకు తన పురుషుడి దగ్గర నుండి సాదర ఆహ్వానం ఉందా?

లేదు.

అనుమానం వుంది.

అవమానం వుంది.

దెప్పిపొడుపు వుంది.

దాని గురించి ఆలోచించండి.

– మన ముందు అజ్ఞానం నోరు తెరుచుకుని నిలబడి వుంది.

తన భార్య కొడుకుని కనివ్వలేదని అలిగి ఇంటికి రానివ్వని భర్తకు చెప్పండి.

'మూర్ఖుడా! మగ నలుసు కలగాలంటే...

నీలో 'వై' క్రోమోజోమ్స్ వుండాలి.

నీలో తప్పు పెట్టుకుని నీ భార్యను సాధిస్తావేం?'

అని అరవండి– అలగండి అతన్ని సాధించుకోండి

పోరాటం సాగించండి.

– ఇంటా, బయట

స్వేచ్ఛ కోసం, రక్షణ కోసం, హక్కు కోసం పోరాడండి.

కానీ

– పోరాటం ఒక వ్యక్తిది కాకూడదు.

ఒక వ్యక్తి స్వార్థం కోసం కాకూడదు.

అలా అయినరోజు చాలామంది నష్టపోతారు.

– పోరాటం సమాజపరంగా రావాలి.

దానికోసం మనం నడుంకట్టాలి.

– మనకు ఇవ్వబడిన మహిళా దినం ఈ సరదాల కోసం కాదు, కాకూడదు. అది మనకు ప్రత్యేకంగా ఇవ్వబడిన వరం.

– ప్రతి మహిళా ఆ రోజున...

గతించిన సంవత్సరంలో ఎన్ని మెట్లు ఎక్కామో లెక్కలు కట్టాలి.

– ప్రతి మహిళా

మహిళా దినం రోజు

మరో మహిళా దినం వచ్చేలోపు ఏమి సాధించాలో ఓత్ తీసుకోవాలి.. ప్రమాణం చేయాలి.

మహిళా దినం పరిమాణాన్ని, దాని గౌరవాన్ని పెంచాలి. ■

## సంచలిత

**వం**దల వేల రాత్రుల ఏకాంత దుఃఖాల్ని
ఎడబాపి పూడ్చిపెట్టి
ఒక కలల ప్రహరి రెటీనా మీద కదలాడి
ఒక వేపచెట్టు మీద కొన్ని కోయిలలు
రాగాల ప్రస్థావనే కాదు–
సమాధుల్లోంచి లేచి వస్తున్న
వేలాది సంవత్సరాల గాజుల చప్పుడూ లేదు..
పగిలిన ఎన్నెన్నో వెన్నెల రాత్రిళ్ళూ
సమష్టి సమాహార ధర్మాధర్మాల్లో
నిర్రనీల్గిన అధీకృత కిరీట తురాయి
కొక్కొరోకో! లెవ్వు! లెవ్వు! / తెల్లవారిందే ఆలస్యం
వాకిలీ సాన్పూ వంటా పొలమూ
నాటూ కలుపూ కోతా గొడ్డూ గోజా
మళ్ళీ మళ్ళీ రాత్రుల్లాటి రాత్రే
పిల్లలూ వంటా తిండీ తిట్లూ
పక్క వంచి పడుకుందామన్నా
పాన్పుల్లో ముళ్ళకంపల శరీరధారి
ఎంత భరించవద్దనుకున్నా
వందల వేల సంవత్సరాల దుఃఖం
ఒక నదిలా ప్రవహిస్తూ ఓదారుస్తూ
తల్లిలాంటి నెనరు సృష్టి ఆద్యంతం–
ఎంత తవ్వినా దొరకదు అందదు
ఎన్నో కన్నీటి నదుల మీదుగా
అక్షరాల స్త్రీలలాటి పుస్తకాలు
తెరిచిన పుస్తకాల్లాంటి స్త్రీలు

–చైతన్య ప్రకాశ్